క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పెడన: పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షకు తమ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తామని నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీకే ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సెల్: 94407 30562, 82474 27885 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ సాహిత్య గ్రంథాల పఠనం

బొబ్బర్లంక(మోపిదేవి): ముంబాయికి చెందిన లింగం రంగారావు బొబ్బర్లంక దళితవాడలో అంబేడ్కర్ సాహిత్య గ్రంథాలను గురువారం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని గ్రంథాలను పఠించారు. ప్రతి ఏటా అంబేడ్కర్ జయంతికి ముందు రోజు ఇక్కడ అంబేడ్కర్ సాహిత్య గ్రంథాలను పఠిస్తారు. ఉప సర్పంచ్ లింగం బసవశంకరరావు, లింగం రాధాకృష్ణ, జయంతిరావు, ఆదిశేషారావు, చినబాబు, అన్నవరపు శంకరరావు, తెనాలి ఆదినారాయణ, పెరికే బుజ్జి, విజయలక్ష్మీ, పద్మ, జై భీమ్ దీక్షధారి దాసి సీతారామరాజు పాల్గొన్నారు.

17 నుంచి దుర్గా–గణపేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



గణపేశ్వరం(నాగాయలంక): గణపేశ్వరంలోని దుర్గా–గణపేశ్వరస్వామి, పార్వతీ–సంగమేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజులు నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 17న గణపతిపూజ, పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేస్తారన్నారు. 18న గణపేశ్వరస్వామి వారికి ఏకాదశ వారాభిషేకాలు, జగజ్యోతి, ఎదుర్కోలు వేడుక అనంతరం రాత్రికి దుర్గా–గణపేశ్వరస్వామి, పార్వతీ–సంగమేశ్వరస్వామి వార్ల కల్యాణం జరుగుతుందని చెప్పారు. 19న రుద్ర హోమం, పూర్ణాహుతి, కొట్నాలు, వసంతోత్సవం,రాత్రికి రథోత్సవం, అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

కృష్ణాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్ '

కోడూరు: ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక అన్నారు. గురువారం కృష్ణాపురం గ్రామంలో 104 సంచార వాహనం ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. వైద్యులు, సిబ్బంది ఇంటికే వచ్చి ప్రాథమిక వైద్యాన్ని అందిస్తారని, వైద్య సమస్యలు ఉంటే గ్రామంలో ఉండే ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. అనంతరం శిబిరంలో రోగులకు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఉప సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ, సీహెచ్‌ఓ ధనలక్ష్మీ, ఎంపీహెచ్‌ఏ మోహనరావు, ఏఎన్‌ఎం మీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



బంటుమిల్లి: అర్తమూరు, బంటుమిల్లి, పెదతుమ్మిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను గురువారం మచిలీపట్నం డివిజినల్ విద్యా శాఖాధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి యూవీ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను, పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కృత్తివెన్ను మండలం సంగమూడి పాఠశాలలోని కేంద్రాన్ని ఆయన సందర్శించారని ఇన్‌చార్జి ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాదు, పరీక్ష కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

అనర్హత వల్లే పర్వీన్ పింఛను నిలుపుదల

మచిలీపట్నంటౌన్: దివ్యాంగురాలు సీమా పర్వీన్ పింఛను పొందేందుకు అనర్హత ఉండబట్టే అధికారులు 2021 సెప్టెంబర్‌లో నోటీసులు ఇచ్చి ఆమె పింఛనును నిలుపుదల చేశారని వైఎస్సార్ సీపీ 27వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ అచ్చెబా గురువారం తెలిపారు. సీమా పర్వీన్ తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో పాటు ప్రస్తుతం నూరుద్దీన్‌పేటలో వారికి రూ. 1.70 కోట్ల విలువైన మూడు గృహాలు ఉండటం, వేలాది రూపాయలు అద్దెలు రావడం, వారి నాలుగు విద్యుత్ మీటర్లకు 300 యూనిట్లకు పైగా విద్యుత్ వాడకం ఉండటంతో అనర్హులుగా గుర్తించారని వివరించారు. అనర్హత ఉన్న వారికి పింఛను ఎలా ఇస్తారో తెలియకుండా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు స్థానిక టీడీపీ నాయకుల మాటలు నమ్మి సెల్ఫీ చాలెంజ్‌లు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

సచివాలయ వ్యవస్థతో పాలన చేరువ

జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక



కోసూరువారిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో కడవకొల్లు తదితరులు



బందరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాంప్రసాద్, నాయకులు

కోసూరువారిపాలెం(మోపిదేవి): పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను గుర్తించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టి పాలనా వ్యవస్థను ప్రజలకు చేరువ చేశారని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. కోసూరువారిపాలెంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను స్థానికులకు వివరించి సర్వే చేశారు. స్టిక్కర్లను అంటించి ఆమె మాట్లాడారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారని, ప్రతి కుటుంబంలో మంచి జరిగితేనే తమకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని దమ్మున్న నాయకుడిగా జగనన్న చెబుతున్నారని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు, ముఖ్యమంత్రి జగనన్నకు ప్రజలు అండగా ఉండాలని కోరారు.

అవనిగడ్డ జగనన్న అడ్డా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలన్నీ నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని, అవనిగడ్డ ఎవరి అడ్డాకాదని, జగనన్న అడ్డా అని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. జగనన్న చెబితే చేస్తారు....బాబు చెబితే చేయడన్నారు. గతంలో రైతులకు రుణమాఫీ చేస్తామని, మహిళలు బ్యాంకుల్లో పెట్టిన బంగారం విడిపిస్తామని చెప్పి చంద్రబాబు ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. జగనన్న ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఓట్లు అడుగుతున్నామని, చిత్తశుద్ధితో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. గడప గడపకు కార్యక్రమంలో ఇప్పటి వరకు 52 గ్రామ సచివాయల్లో ప్రజలను కలిసి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించామన్నారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడారు. గ్రామ సర్పంచ్ కోసూరు అనూష, గరికిపాటి వెంకటేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ మద్ది చిన్నా, నాయకులు ఉప్పాల రాము, కార్యకర్తలు గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన కోసూరు సురేష్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రతి నోటా 'మా నమ్మకం నువ్వే జగన్'

కోడూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ప్రతి ఇంటి వద్ద పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారు. కోడూరు–2, కోడూరు–1, వి.కొత్తపాలెం సచివాలయాల పరిధిలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతిలో ఇంటి గోడలపై స్టిక్కర్లు అతికించారు. కరోనా కష్ట సమయంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తమను అన్ని విధాలుగా ఆదుకుందంటూ ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండల సచివాలయాల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● నాగాయలంక: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అవనిగడ్డ నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి) అన్నారు. మర్రిపాలెం, భావదేవరపల్లి, నంగేగడ్డ సచివాలయాల పరిధిలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వలంటీర్లతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చాట్రగడ్డ బాబూరావు, తోట కృష్ణ, మద్ది కొండలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



అవనిగడ్డ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, నాయకులు

అవనిగడ్డలో..

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని 4, 5 సచివాలయాల పరిధిలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ తుంగల సుమతీదేవి, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ షేక్ నజీర్‌బాషా ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వ పనితీరుపై సర్వే చేశారు. మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సామర్ల రాముడు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రజల్లో మంచి స్పందన

మచిలీపట్నంటౌన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వైఎస్సార్ సీపీ శ్రేణులు నగరంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను స్థానికులకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు మరిచిపోలేమని ఆయా డివిజన్ల ప్రజలు నాయకులకు వివరించారు. 23వ డివిజన్‌లో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, 28వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ షేక్ షాహెదా, డివిజన్ ఇన్‌చార్జ్ మహమ్మద్ సాహెబ్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి వెళ్లారు. 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, సచివాలయ కన్వీనర్లు దార్ల చెన్నకేశవరావు, ఫణిభూషణ్, జవ్వాది రాంబాబు ఇంటింటికి వెళ్లి బ్రోచర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. పలు డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత థామస్ నోబుల్, లంకా సూరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ, గూడవల్లి నాగరాజు పాల్గొన్నారు.

నిరుపేదల ఆర్థిక ప్రగతికి సీఎం జగన్ కృషి

● అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
● చల్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

చల్లపల్లి: నిరుపేదల ఆర్థిక ప్రగతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం స్థానిక చల్లపల్లి గ్రామ సచివాలయం–2 పరిధిలోని నారాయణరావు నగర్ కాలనీలో నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు కాలనీలోని 484 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిపాలన చేపట్టిన నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, కరోనా కష్టకాలంలోనూ ఏ మాత్రం ఆపకుండా పేదలకు అండగా నిలిచారని తెలిపారు. జగన్ పాలన చేపట్టిన నాటి నుంచి రాష్ట్రం సుభిక్షంగా పాడి పంటలతో వర్ధిల్లుతోందన్నారు. కాలువలకు సకాలంలో సాగునీరు అందిస్తూ, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం మొదలుకుని మార్కెట్ వరకు సేవలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఘంటసాల జెడ్పీటీసీ తుమ్మల మురళి, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సర్పంచ్‌లు డొక్కు నాగేశ్వరరావు, గొరిపర్తి సురేష్‌బాబు, కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పేరం నాగిరెడ్డి, అరజా శివశంకర్, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు సహకరించాలి

ఆలయ ఏసీ ఎన్‌ఎస్ చక్రధరరావు



జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆలయ ఏసీ చక్రధరరావు

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని ఆలయ ఏసీ ఎన్‌ఎస్ చక్రధరరావు కోరారు. స్వామివారి దర్శనార్థం గురువారం ఆలయానికి విచ్చేసిన ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ ఏసీ చక్రధరరావు మాట్లాడుతూ స్వామి వారి దర్శనార్థం దేశ, విదేశాల నుంచి భక్తి భావంతో నిత్యం విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం దేవస్థానానికి చెందిన స్థలం మరింత విస్తరించాల్సి ఉందని చెప్పారు. దేవస్థానం పక్కనే ఉన్న జెడ్పీ పాఠశాల స్థలం ఆలయానికి ఇచ్చి ఆ పక్కనే ఉన్న దేవస్థానం భూమిలో పాఠశాలకు సంబంధించి విశాలమైన భవనాలు నిర్మించి ఇస్తామని వినతిపత్రంలో వివరించారు. ఈ భూమి మార్పిడికి జిల్లా పరిషత్ నుంచి సహకరించాలని కోరారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, బీసీ మండల కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, లింగం జగదీష్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కోనేరుసెంటర్: తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..మచిలీపట్నం సుందరయ్య నగర్‌కు చెందిన యువతి డిగ్రీ చదివి కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం ఇంటి నుంచే విధులు నిర్వహిస్తోంది. ఈనెల 11వ తేదీన భోజనం చేసి కుటుంబ సభ్యులు నిద్రించారు. ఉదయం లేచి చూసేసరికి యువతి కనిపించలేదు. ఆమె స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ధాన్యం నిల్వల లెక్క తేలింది

● ధాన్యం నిల్వలపై సర్వే చేసిన అధికారులు
● పెడన నియోజకవర్గంలో 34,702 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు
● కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి



కాకర్లమూడిలో సర్వే చేసి రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీపీఓ నాగేశ్వర నాయక్ (ఫైల్)

పెడన: రైతులు ఖరీఫ్ సీజన్‌లో తమ పంటలను కుప్పలుగా వేసుకుని ఉంచేశారు. ఆరుతడి పంటలు మినుము పూర్తయిన తరువాత కుప్పలను తీసి మళ్లీ నూర్పిళ్లు ప్రారంభించారు. పెడన నియోజకవర్గంలో రైతుల వద్ద 34,702 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్లు అధికారుల సర్వే చెబుతోంది. గత నవంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేయడంతో రైతులు తమ ధాన్యం విక్రయించుకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మళ్లీ తెరవాలని రైతులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. 2022 నవంబరు నుంచి నాలుగు నెలలు అంటే 2023 ఫిబ్రవరి వరకు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచి ఉంచారు. రైతుల నుంచి డిమాండ్ రావడంతో మరో నెల రోజులు పొడిగించారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో కాకుండా పది రోజుల పాటు ఆఫ్‌లైన్‌లో కూడా రైతులకు అవకాశం కల్పించారు. అయినా కొందరు రైతులు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం కేంద్రాలను మూసివేసింది. వాతావరణం అనుకూలించడంతో పాటు ఆరుతడి పంటలు కూడా తీసేసి వరి నూర్పిళ్లు చేస్తున్నారు. ఇప్పుడు నూర్పిళ్లు చేస్తున్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు మంత్రి జోగి రమేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

అధికారుల సర్వే..

ఈ నేపథ్యంలోనే రైతులు వద్ద ధాన్యం నిల్వలు ఏ మేరకు ఉంటాయనే దానిపై స్పష్టమైన నివేదికలు కావాలని ప్రభుత్వం కోరడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్నతాధికారులతో పాటు డివిజన్, మండల స్థాయి అధికారులతో సర్వే చేయించింది. రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు అమలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. అధికారులు సర్వే చేసి నివేదికలను ఆయా మండలాల్లోని వ్యవసాయ శాఖాధికారులకు నివేదికలు అందజేశారు. విస్తీర్ణం తక్కువగా ఉండి రైతులు అధికంగా అపరాల సాగుకు ముందే నూర్పిళ్లు పూర్తి చేసుకున్న చోట ఒక్క రోజులోనే సర్వే పూర్తి చేయగా వరికుప్పలు అధికంగా ఉన్న చోట మాత్రం సర్వే చేయడానికి రెండు రోజుల సమయం తీసుకున్నారు.

ఏ మండలంలో ఎంతెంత అంటే..

పెడన నియోజకవర్గం గూడూరు మండలంలో అత్యధికంగా ధాన్యం నిల్వలున్నాయి. గన్నీ బ్యాగుల్లోనే కాకుండా కుప్పల రూపంలో 3,251 మంది రైతులకు చెందిన 16,327 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. పెడన మండలంలో 3,131 మంది రైతులకు చెందిన ధాన్యం 15,811 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. బంటుమిల్లి మండలంలో 442 మంది రైతులకు సంబంధించి 2,538 మెట్రిక్ టన్నులు, కృత్తివెన్ను మండలంలో ఒక్క రైతుకు సంబంధించి 26 మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదికలు



ఇటీవల అధికారులు ప్రతి ఆర్‌బీకే పరిధిలో ధాన్యం నిల్వలపై సర్వే చేశారు. వరి కుప్పలు ఎన్ని ఉన్నాయి, వాటిల్లో సుమారు ఎన్ని బస్తాల ధాన్యం వస్తుంది, గన్నీ బ్యాగుల్లో ధాన్యం నిల్వలు ఎక్కడెక్కడ ఎంత ఉన్నాయనే దానిపై నివేదికలు ఇచ్చారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం. కొనుగోలు కేంద్రాలు తెరవడానికి అవకాశం ఇస్తే మాత్రం ప్రభుత్వం మళ్లీ గడవు పెంచదు. రైతులు గమనించి తెరిచిన వెంటనే సద్వినియోగం చేసుకోవాలి.

– జీవీ శ్రీనివాసరావు, ఏఓ, పెడన

నేడు అంబేడ్కర్ జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె. సరస్వతి గురువారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మచిలీపట్నం లక్ష్మీటాకీసు సెంటరులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని, 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశపు హాల్‌లో సభ నిర్వహిస్తామని చెప్పారు.

పెడన వేడుకలకు మంత్రి జోగి రమేష్

పెడన: పెడన మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ పార్కులోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జరిగే జయంతి వేడుకకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణిలు హాజరవుతారని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

వ్యర్థాల తొలగింపు

మచిలీపట్నంటౌన్: రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలను 22వ డివిజన్ కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. కార్పొరేటర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

రేపటి నుంచి చేపల వేట నిషేధం

కోడూరు: సముద్రంలో శనివారం నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేట నిషేధాజ్ఞలు కొనసాగుతాయని అవనిగడ్డ ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ గురువారం తెలిపారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వేట నిషేధాన్ని అమలు చేస్తున్నామన్నారు. నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లోని మత్స్యకారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, నిషేధాజ్ఞలు పాటించకుండా వేటకు వెళితే కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌డీఓ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటూ వేట నిషేధ భృతి కింద రూ.10 వేల నగదును ఆర్థిక సహాయంగా అందిస్తోందని, గత ఏడాది అక్టోబర్ 30వ తేదీ నాటికి లైసెన్సులు రిజిస్టర్ చేసుకున్న బోట్లల్లో వేటకు వెళ్లే వారికి ఈ భృతి అందుతుందని చెప్పారు. అర్హులను గుర్తించేందుకు చేపల వేట చేసే ప్రాంతాలు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో ఈ నెల 17న మరోసారి సర్వే చేస్తామని చెప్పారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

మచిలీపట్నంటౌన్: 13వ డివిజన్ రైలుపేట ఎలిమెంటరీ, హైస్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులకు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దళిత జేఏసీ ఆధ్వర్యంలో గురువారం జామెట్రీ బాక్సులు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గాజుల భగవాన్, దళిత జేఏసీ నాయకులు బందెల థామస్ నోబుల్, కుంపటి జయకర్, కొడమంచిలి చంద్రశేఖర్, పరిసె కీర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటిపై హక్కు కల్పించాం



ఓటీఎస్ డాక్యుమెంట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

చల్లపల్లి: దశాబ్దాలుగా బీ–ఫారం పట్టాల భూముల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందజేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో ఎమ్మెల్యే రమేష్‌బాబు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద వన్ టైం సెటిల్‌మెంట్ విధానంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు డాక్యుమెంట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా పేదలకు ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలంపై హక్కుతో పాటు, గృహ నిర్మాణ పథకం బకాయి పూర్తిగా క్లియర్ చేస్తున్నామని చెప్పారు..

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

గూడూరు: కోకనారాయణపాలెం రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాల సేకరణపై గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఆర్సీ ఏడీఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ జె.పవన్ వీఏఏలకు శిక్షణ ఇచ్చారు. ఏడీఏ మాట్లాడుతూ మట్టి నమూనాల పరిశీలన ద్వారా నేలలోని పోషకాల పరిమాణం, నేల స్వభావం తెలుసుకోవచ్చన్నారు. తద్వారా నేల స్వభావాన్ని బట్టి రైతులు వాడాల్సిన ఎరువుల పరిమాణాన్ని అంచనా వేసి పెట్టుబడి ఖర్చును తగ్గించడానికి అవకాశం దక్కుతుందని చెప్పారు. పశువుల ఎరువు, పచ్చిరొట్టల వాడకం వల్ల నేల సారవంతంగా మారుతుందన్నారు. గూడూరు మండల వ్యవసాయ శాఖాధికారి కె.హెప్సిబారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రచార భేరి పోస్టర్ల ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు మోదీ హటావో, దేశ్ కో బచావో నినాదంతో నిర్వహించనున్న కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆ పార్టీ నాయకులు గురువారం ఆవిష్కరించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి పి. తాతయ్య, సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు, మోదుమూడి నాగరాజు, సీపీఎం జిల్లా నాయకుడు కొడాలి శర్మ, సీఐటీయూ నాయకుడు సీహెచ్ జయరావు తదితరులు పాల్గొన్నారు.